క్లుప్తంగా

శక్తియాప్‌ను వినియోగించుకోండి



శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న మహిళలు

నంద్యాల(న్యూటౌన్): మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన శక్తియాప్‌ను ఆపద సమయంలో వినియోగించుకోవాలని మహిళా పోలీసు స్టేషన్ సీఐ జయరాం సూచించారు. పట్టణంలో ఉచిత కుట్టుమిషన్ నేర్చుకుంటున్న మహిళలకు శుక్రవారం వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేస్తే ఆరోగ్య సంబంధ సమస్యలు తలెత్తుతాయన్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం చేతివృత్తుల్లో శిక్షణ ఇప్పిస్తుందన్నారు.

నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యం



అన్నా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: తక్కువ ధరతో నిరుపేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ల ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా ఆసుపత్రి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఉదయం, మధ్యాహ్నం ఏఏ ఆహారపదార్థాలు వడిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ నిర్ణీత రుసుం రూ.5 చెల్లించి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోరింటాకు వేడుకలు



గౌరమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మహిళలు గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. తర్వాత భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ మహిళలు అరచేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. ఒకరినొకరు పసుపు, కుంకుమ, రవికలను ఇచ్చి పుచ్చుకున్నారు.

వంగవీటి రంగాకు నివాళి



రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): బలిజ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కాప్స్‌రాక్స్ కార్యాలయంలో శుక్రవారం వంగవీటి మోహన్‌రంగ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బలిజ సంఘం నాయకులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, మల్లికార్జున, పసుపులేటి జనార్దన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల హృదయాల్లో వంగవీటి రంగ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేశ్వరరావు, సురేష్, చింతలకుమార్, శ్రీహరి, చంద్రమోహన్, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నిక



చాగలమర్రిలో లాల్‌స్వామి కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులతో సభ్యులు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో శ్రీలాల్‌స్వామి కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, ముల్లా ఇబ్రహీంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరు రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతారని సంయుక్త కార్యదర్శి ముల్లా షఫి తెలిపారు. శుక్రవారం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను మొహర్రం పండుగ సందర్భంగా కమిటీ మర్యాదలతో ఊరేగింపు నిర్వహించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ క్యాషియర్ వైస్ ఎంపీపీ ముల్లారఫీ, సభ్యులు ముల్లా షఫి, దాదాపీర్, షంషీర్, చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శాకాంబరీ నమోస్తుతే

రుద్రవరం: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రుద్రవరంలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించారు. అర్చకులు విశ్వనాథ శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య మహిళలు చీర, సారె, పండ్లు, కూరగాయలు తీసుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు వాటితో అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చోళవేటి సూర్యనారాయణ, కోశాధికారి పెరుమాళ్ల నరసింహయ్య, కార్యదర్శి పాలూరు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అమ్మవార్లకు సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వెలసిన జగజ్జననీ , శ్రీకాళికాంబ అమ్మవార్లకు ఆషాఢ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు అమ్మవార్లకు సారె సమర్పించి కోరికలు తీర్చుకున్నారు. ముందుగా అర్చకులు జగజ్జననీ ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తర్వాత అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు అమ్మవారి ప్రతిమను అలంకరించి సారె సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు వారికి అన్నప్రసాద వితరణ చేశారు.



రుద్రవరంలో కాన్యకా పరమేశ్వరిని పండ్లు , కాయగూరలతో అలంకరించి పూజలు చేస్తున్న భక్తులు

కాళికాంబ దేవాలయంలో..

శ్రీకాళికాంబ చంద్రశేఖరదేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారిని శుక్రవారం శాకాంబరీగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పల్లకీ సేవ నిర్వహించి నవ విధ హారతులు అందజేశారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ కాళీమాత సేవా సమాజ్ వారు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, రమేష్‌లు, తదితరులు పాల్గొన్నారు.



రుద్రవరంలో అమ్మవారికి సమర్పించేందుకు చీర సారె తీసుకొచ్చిన మహిళలు



శాకాంబరీగా శ్రీకాళికాంబాదేవి



జగజ్జననీ అమ్మవారికి సారె, బోనాలు ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

పక్కాగా లబ్ధిదారుల జాబితా పరిశీలన

నంద్యాల(అర్బన్): అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితా పరిశీలన పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. అర్హులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఏలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత లేని వారి పేర్లను తిరస్కరించాలన్నారు. ప్రభుత్వ, ఇనామ్ భూముల రైతుల వివరాలు సేకరించి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాదరావు, ఆర్‌ఐలు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

దొర్నిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమవేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో హాజరు కావాలని కోరారు. ప్రజా సమస్యలపై చర్చించడానికి ఇది చక్కని వేదిక అని పేర్కొన్నారు.

కార్మికుల సత్తా చాటుదాం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం ఉద్ధృతం చేసి కార్మికుల సత్తాచాటుదామని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాసులు, లక్ష్మణ్, గౌస్, తోటమద్దులు అన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ఈనెల 9వ తేదీన సమ్మె చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, 10గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.800 వేతనం ఇవ్వాలని కోరారు. అలాగే విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బాలవెంకట్, వెంకటలింగం, లక్ష్మణ్, సురేష్, శ్రీనివాసరెడ్డి, మహిళా నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

డిమాండ్ల సాధనకు ఉద్యోగుల ధర్నా



డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో నాయకులు కొండారెడ్డి, మూర్తి మాట్లాడుతూ పదోన్నతులపై వెంటనే అనుమతులు ఇవ్వాలని, ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేసి ఆర్టీసీ సిబ్బందితో నడిపించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు 11వ పీఆర్సీ, అరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. రిటైర్డు ఉద్యోగులకు గ్రాడ్యూటీ, టెర్మినల్, ఎన్‌క్యాష్‌మెంట్ ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డబుల్ డ్యూటీ చేసే ఉద్యోగులకు డీడీ అమౌంట్ పెంచాలని, కాలం చెల్లిన బస్సులను సర్వీసులకు ఉపయోగించరాదన్నారు. వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో నాయకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహ, మహమ్మద్‌గౌస్, తోట మద్దు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే పేదల జీవితాల్లో వెలుగులు తెస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. ఏడాది గడిచినా అతీగతీ లేదన్నారు. అలాగే బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 50ఏళ్లకే పింఛన్, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి, రూ.20లక్షల ఉద్యోగాలు, ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇలా పలు హామీలు గుప్పించి మోసం చేశారన్నారు. అన్యాయంగా వలంటీర్లను తొలగించి రోడ్డున పడేశారని చెప్పారు. ప్రజల్లో వ్యతిరేకత రాకముందే ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో ప్రజా పోరాటాలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటలింగం, దర్శనం, తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

రీ సర్వేలో రూ.లక్షలు దండుకుంటున్నారు!

- తన భూమి వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించలేదంటూ కానాల టీడీపీ నాయకుడు చిందులు



అధికారులపై చిందులేస్తున్న హుసేన్‌బాబు

నంద్యాల(అర్బన్): భూ రీసర్వేకు సంబంధించిన పనుల్లో రెవెన్యూ అధికారులు లక్షల రూపాయలు దండుకుంటున్నారని నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు హుసేన్‌బాబు ఆరోపించారు. ప్రతి పనికి పైసలు వసూలు చేస్తున్నారని చెప్పారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన రెవెన్యూ అధికారులపై చిందులేశాడు. సర్వే నెం.194, 195లోని తన పొలం వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించేందుకు వేరొకరి అనుమతులు తీసుకోవాలని సర్వేయర్, డిప్యూటీ తహసీల్దార్లు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అధికారంలో లేని వారిని అందలం ఎక్కిస్తూ అధికారంలో ఉన్న తమను పట్టించుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటూ హెచ్చరించారు. రైతులకు సంబంధించిన పనులు చేయాలంటే అధికారుల చేయి తడపాల్సిన పరిస్థితి నెలకొందని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు.

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాడుతాం

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసే వరకు తాము పోరాటం కొనసాగిస్తామని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని ముస్లిం హక్కులపై దాడిగా భావించాల్సి ఉంటుందన్నారు. తమ ఆస్తులపై ఆధిపత్యాన్ని దెబ్బతీసే ప్రయత్నంగా ఉన్నాయన్నారు. ఈ చట్టంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు అబులైస్ అబ్దుల్ సమ్మద్, మస్తాన్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

దొర్నిపాడు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ నాసరారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్డీ శివప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆందోళన విరమణ

నంద్యాల(న్యూటౌన్): దాడికి పాల్పడిన మెప్మా సీఓ లక్ష్మీకుమారిపై చర్యలు తీసుకుంటామన్న అధికారుల హామీ ఇవ్వడంతో ఆందోళన కార్యక్రమాలను విరమిస్తున్నట్లు ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు సుజాత, హైమావతి, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, గౌస్ తెలిపారు. సీఓ తీరుపై గత మూడు రోజులుగా మెప్మా కార్యాలయం ఎదుట ఆర్పీలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం మున్సిపల్ అధికారులు స్పందించి సీఓపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఆర్పీలు తమపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, సత్యవతి, ప్రసన్నకుమారి, సులోచన, సువర్ణ, మాధవి, జ్యోతి, పుష్పలత, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలి

ఉయ్యాలవాడ: మొహర్రం వేడుకలను గ్రామీణ ప్రజలు కలసిమెలసి జరుపుకొని మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి సూచించారు. మండలంలోని రూపనగుడి గ్రామం పీర్ల చావిడి ఆవరణలో రెండు వర్గాలకు సంబంధించిన వారితో సీఐ మాట్లాడారు. గత ఏడాది పీర్ల ఊరేగింపు సమయంలో ఘర్షణ చోటుచేసుకుందని, ఈసారి అలాంటి పరిస్థితి పునరావృత కాకూడదని చెప్పారు. తమ ఆదేశాలు బేఖాతర్ చేస్తే రౌడీ షీట్ తెరుస్తామని హెచ్చరించారు.

నేడు లేజర్ రన్ ఎంపిక పోటీలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి అవుట్ డోర్ స్టేడియంలో శనివారం నంద్యాల జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ బాల బాలికల విభాగాల్లో లేజర్ రన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మోడరన్ పెంటథాలన్ అధ్యక్షుడు పృథ్వీ, కార్యదర్శి తిరువీధి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు రూ.50 ప్రవేశ రుసుం చెల్లించి పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 7658933261 నంబరును సంప్రదించాలన్నారు.

వరి సాగుకు సమాయత్తం

ఉయ్యాలవాడ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందుగా మే నెల నుంచే వర్షాలు కురిశాయి. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం, అవుకు రిజర్వాయర్లకు వరద నీరు వచ్చి చేరుతోంది. దీనికి తోడు ప్రస్తుతం కుందూనదిలో నీరు సంవృద్ధిగా విద్యుత్ మోటార్లకు అందుతుండటంతో తీరం వెంట ఉన్న 14 గ్రామాల రైతులు వరి పంట సాగుకు సమాయత్తమవుతున్నారు. గత ఏడాది నవంబర్‌లో వరుస తుపాన్లతో కురిసిన వర్షాలకు వరి పంట దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 32 నుంచి 35 బస్తాలు దిగుబడులు లభించాయి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించకపోవడంతో 70 కేజీల బస్తా రూ. 1150 నుంచి రూ. 1200లోపు అమ్ముకోవాల్సి వచ్చింది. దీంతో రైతులకు పెట్టుబడుల కూడా అందక నష్టపోయారు. ఈ సారి కాలం కలసి వస్తుందనే ఆశతో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇందులో భాగంగా వరి పంట సాగు కోసం వరినారును సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 1052 హెక్టార్లు కాగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 1200 హెక్టార్ల వరకు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.



సుద్దమల్లలో సాగు చేసిన వరి నారుమడి

కొనసాగుతున్న పీర్ల ఉత్సవాలు



ముల్లాన్‌పేటలోని హుసేన్‌ఆలంకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పిస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): మొహర్రం వేడుకల్లో భాగంగా 8వ రోజు శుక్రవారం మకాన్‌లోని పీర్లకు ముజావర్లు ఫాతెహాలు సమర్పించారు. నంద్యాల పట్టణంలోని నీలివీధిలో వెలసిన తల్లిపీరు, ముల్లాన్‌పేటలోని హుసేన్‌ఆలాం, కల్పనా సెంటర్‌లోని ఇమామ్‌కాశీం, చాంద్‌బాడలోని అలీ అక్బర్, గాంధీచౌక్‌లో హసన్ పీర్లకు భక్తులు ప్రత్యేక పూలు, బాసికాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



చిత్రేనిపల్లెలో ఫాతెహాలు అందుకున్న పీర్లు

గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు

గోస్పాడు: మొహర్రం పండుగ సందర్భంగా మండల పరిధిలోని జూలేపల్లె, గోస్పాడు, పసురపాడు, ఒంటివెలగల, కానాలపల్లె, ఒంటివెలగల, ఎం.కృష్ణాపురం తదితర గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. కులమతాలకు అతీతంగా ప్రజలు పీర్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంతో పాటు ఆర్.నాగులవరం, నర్సాపురం, ఆలమూరు, చిత్రేణిపల్లె, పెద్దకంబలూరు, ఎల్లావత్తుల, కోటకొండ, తదితర గ్రామాల్లో శుక్రవారం చిన్నసరిగెత్తు వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాల్లో చావిళ్లలో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. చావిళ్ల నిర్వాహకులు పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు.

కేజీరెడ్డిని అరెస్టు చేయాలి

గోస్పాడు: ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న మహిళా సెక్యూరిటీగార్డులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఎస్‌ఓ కేజీరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని సర్వజన ఆసుపత్రి వద్ద ఆ యూనియన్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో ఎన్నో ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న మహిళలు తమకు వేతనం పెంచమని అడుగుతుంటే ఎస్‌ఓ కేజీ రెడ్డి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని భయపెడుతూ అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయనను వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ జిల్లా నాయకులు నాగన్న, చెన్నయ్య, లక్ష్మి, చంద్రకళ, నరేష్, నరసింహరాజు, జయరాజు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న దృశ్యం

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



చెత్తసంపద కేంద్రంను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

దొర్నిపాడు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను డీఎల్‌పీఓ రాంబాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు విధుల్లో చేరాలని జీతాలు వచ్చేలా చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఎక్కడైనా మురుగు నిల్వలు లేకుండా చేయాలన్నారు. కార్యదర్శులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివప్రసాద్, గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి, కార్యదర్శులు ఓబులేసు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాక రూపకర్తకు నివాళి

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్‌స్కూల్‌లో శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పింగళి వెంకటయ్య గొప్ప దేశభక్తుడని చెప్పారు. ఆయన ఆశయాలను అనుగుణంగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అలాగే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు.



మోడల్‌స్కూల్‌లో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

డోన్: చట్టవ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లు, నర్సింగ్ హోంలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డీఓ నరసింహులు హెచ్చరించారు. సెంటర్లు సీజ్ చేయడమే కాకుండా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీనటల్ డైగ్నోస్టిక్స్ టెక్నిక్స్ (PCPNDT) యాక్ట్ పరిరక్షణలో భాగంగా మల్టీ మెంబర్ అడ్వైజరీ అథారిటీ కమిటీ సమావేశం శుక్రవారం డోన్ ఆర్‌డీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. నర్సింగ్ హోంలు, స్కానింగ్ సెంటర్లు తమ లైసెన్సులు కాలపరిమితి ముగిసిన వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. చట్టవిరుద్ధంగా స్కానింగ్‌లు జరుపుతున్న సెంటర్లకు ముందుగా నోటీసులు జారీ చేసి, ఆ తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ నరసింహులు

టామని హెచ్చరించారు. ఆరోపణలు రుజువైతే ఆసుపత్రులను మూసివేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. కమిటీ చైర్మన్ డాక్టర్ చెన్నకేశవులు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ సలీమా, న్యాయవాది మధుసూదన్‌రెడ్డి, సామాజిక కార్యకర్తలు మహమ్మద్ రఫీ, ఏతః నాగరాజు, మధు, డిప్యూటీ హెల్త్ అధికారి రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.